ఐదు దశాబ్దాల తర్వాత.. ఒకే వేదికపైకి

ఒకే వేదికపై 50ఏండ్లకు కలుసుకున్న మిత్రబృందం

లక్షెట్టిపేట, జూలై 14 : యాభై ఏండ్ల నాటి చిననాటి మిత్రులు ఒకే వేదికపై కలుసుకుని ఆటాపాటలతో సందడి చేశారు. ఆదివారం పట్టణంలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాలులో 1974-75వ సంవత్సరం లక్షెట్టిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 ఏండ్ల తర్వాత కలిసిన మిత్రులు అలనాడు చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. ప్రస్తుతం వాళ్లంతా పిల్లలకు పెళ్లిళ్లు చేసి మనవలు, మనవరాళ్లతో ఆడుకునే వయస్సులో మరోసారి వారి చిన్ననాటి జ్ఞాపకాలను అద్దం పట్టేలా ఒకటవడం చూపరులను ఆకట్టుకున్నది. సుమారు 100 మంది వరకు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది చుంచు సదానందంతోపాటు పలువురు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని కళాంజలి ఫంక్షన్ హాలులో స్థానిక విజ్ఞాన్ విద్యాలయంలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన వారు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాడు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, సురేశ్ నాయక్, మహేశ్, రాఖేశ్, అనీల్, రంజిత్, నరేశ్, సంతోష్‌తోపాటు సుమారు 80 మంది పాల్గొన్నారు.

జీపీలకు నిధుల కొరత

● విడుదల కాని కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం డబ్బు ● ముందుకు సాగని అభివృద్ధి పనులు
● సొంతంగా ఖర్చు పెడుతున్న పంచాయతీ కార్యదర్శులు ● బిల్లులు రాక ఇబ్బందులు

హాజీపూర్, జూలై 14 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన ఆర్థిక సంఘాల నిధులు రాక పోవడంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు ముందుకుసాగడం లేదు. ప్రభుత్వాల నుంచి నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో ఆదాయ వనరులు లేని చిన్న గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. అరకొరగా వస్తున్న ఆదాయంతో మేజర్ గ్రామ పంచాయతీల్లో పనులను నెట్టుకొస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సొంతంగా డబ్బులు ఖర్చు పెట్టి పనులు చేపడుతున్నారు. మంచిర్యాల జిల్లాలో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొన్ని నెలలుగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు సైతం గ్రామ పంచాయతీలకు విడుదల కావడం లేదు. విద్యుత్ బిల్లులు, కార్మికుల వేతనాలు, వీధి దీపాల నిర్వహణ, ట్రాక్టర్ డీజిల్, తాగు నీటి మోటర్ల మరమ్మతులతో పాటు వివిధ పనుల నిర్వాహణ భారంగా మారింది. మేజర్ గ్రామ పంచాయతీల వారికి వస్తున్న ఆదాయంతో పూర్తి స్థాయిలో పనులు జరగడం లేదు. చిన్న గ్రామ పంచాయతీల్లో ఆదాయం రాక పనులు సాగక పాలన స్తంభించింది.

రెండేళ్లుగా విడుదల కాని కేంద్రం నిధులు

2023 నవంబర్ నుంచి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం విడుదల కావడం లేదు. ఈ నిధులు మూడు నెలలకోసారి విడుదల అవుతుండగా మేజర్ గ్రామ పంచాయతీలకు దాదాపు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు, చిన్న గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిధులు అందుతాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు 2022 అక్టోబర్ నుంచి నేటి వరకు 24 నెలలు (రెండేళ్లు)గా విడుదల కావడం లేదు. గత ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖకు నిధుల కేటాయింపులు అధికంగా కేటాయించామని చెబుతుండగా మరి రెండేళ్లుగా గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు ఎక్కడికి వెళ్లినట్లు అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శుల గందరగోళం

నిధుల లేమితో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందుల మధ్య గ్రామాల్లో పనులు చేయిస్తున్నారు. గ్రామంలో తాగు నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ విషయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులను వెచ్చిస్తూ పనులు చేయిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలనే ఆదేశాల మేరకు పారిశుధ్య పనుల నిర్వహణ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతున్నది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అప్పులు తీసుకరావడంతో పాటు సొంతంగా డబ్బులు ఖర్చు పెట్టి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో బదిలీ అయితే ఎలా అని కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం కావడంతో ఇటు పారిశుధ్య పనులు, గ్రామ పంచాయతీల నిర్వహణ భారం తమపై పడకుండా నిధుల లేమి, నిధుల కొరతపై ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకపోయి నిధులను మంజూరు చేయించాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

నిధులు విడుదల కాలేదు..

కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు 2023 సెప్టెంబర్ నుంచి విడుదల కాలేదు. కొన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సొంతంగా డబ్బులు పెట్టి పనులను చేశారు. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు ఉన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులు పెట్టిన వారు బిల్లులు పెడితే నిధులు రాగానే వారికి చెల్లిస్తాం.

- వెంకటేశ్వర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి, మంచిర్యాల

పాలకంటే ఎక్కువ మద్యం తాగేస్తున్నారు

ఆసిఫాబాద్ జిల్లాలో మిల్క్ కన్నా లిక్కర్ వాడకం అధికం

బెల్టుషాపుల కారణంగా మత్తుకు బానిసవుతున్న యువత

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 14(నమస్తే తెలంగాణ) : ఆరోగ్యాన్ని అందించే పాలకంటే.. ఆరోగ్యానికి హానికరమైన మద్యాన్ని తాగడానికే జిల్లావాసులు మొగ్గు చూపుతున్నారు. పౌష్టికాహారమైన పాలని రోజు తాగితే ఆరోగ్యానికి మంచిదని తెలిసినా తాగేందుకు ఇష్టపడడం లేదు. మద్యం ఆరోగ్యానికి హానికరమని, ప్రాణాంతకమని తెలిసినా తాగేస్తున్నారు. మద్యానికి దూరంగా ఉండాలని వైద్యులు, ఆరోగ్యాన్ని గురించి తెలియజేసే మేధావులు ఇచ్చే సలహాలను ఎవరు పట్టించుకోవడం లేదు. పాలు తాగడం కంటే లిక్కర్ తాగడంపైనే ఆసక్తి చూపుతున్నారు. గ్లాసెడు పాలు కొనుక్కుని తాగటానికి ఆసక్తి చూపని వాళ్లు.. వందల రూపాయలు ఖర్చు పెట్టి మద్యాన్ని తాగేస్తున్నారు. జిల్లాలో జరిగే మద్యం సేల్స్ దిమ్మతిరిగిపోతోంది.

పల్లెల్లో ఏరులై పారుతున్న మద్యం

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పాలు, టీ, కాఫీ, చాయ్ రూపంలో ప్రజలు రోజు 24 నుంచి 25 వేల లీటర్ల పాలు తాగుతున్నారు. కాగా.. జిల్లాలో రోజుకు మద్యం దాదాపు 1000 నుంచి 1200 కేసులు, బీర్లు 1200 కేసులు అమ్ముడు పోతున్నాయి. అంటే రోజుకు 24-30 వేల లీటర్ల మద్యాన్ని మందుబాబులు తాగేస్తున్నారు. కాగా.. జిల్లాలోని కిరాణా దుకాణాల్లో పాలు దొరకవుగాని, మద్యం బాటిళ్లు మాత్రం తప్పకుండా దొరుకుతున్నాయి. గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టుషాపులు ఉండడంతో అమ్మకాలు విపరీతంగా జరుగుతున్నాయి. బెల్టుషాపుల వల్ల వయస్సు మళ్లిన వారితోపాటు యువత కూడా మద్యానికి బానిసలవుతున్నారు. తాగేందుకు పాలు, మంచినీళ్లు దొరకని గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నది. మద్యం విక్రయాలపై ఆంక్షలు లేకపోవడంతో పాలకంటే మద్యం అధికంగా అమ్ముడవుతున్నది. ప్రభుత్వానికి మద్యం సేల్స్‌పై వచ్చే ఆదాయమే ప్రధానం కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. చదువుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాల్సిన యువత మద్యానికి బానిసలు అవుతున్నారు. వైన్స్‌ల్లో కంటే గ్రామాల్లో ఉన్న బెల్టుషాపుల్లోనే మద్యం ఎక్కువగా విక్రయాలు జరుగుతున్నాయి.

అనుమతులు తీసుకోవడంలో యాజమాన్యం విఫలం

● డైరెక్టర్ పీపీ నుంచి మేనేజర్ వరకు అందరినీ సస్పెండ్ చేయాలి ● ఆర్కే-7 గని నార్త్‌లో ఉత్పత్తి నిలిపివేతకు అధికారుల నిర్లక్ష్యమే కారణం
● వెంటనే అనుమతులు తెప్పించి గనిలో ఉత్పత్తి ప్రారంభించాలి ● కార్మికులను స్థానికంగానే సర్దుబాటు చేయాలి ● టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి

శ్రీరాంపూర్, జూలై 14 : 'శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-7 గనిలో ఉత్పత్తి చేపట్టేందుకు ఫారెస్టు, ఎన్విరాన్‌మెంట్ శాఖ అనుమతులు తీసుకోవడంలో సింగరేణి యాజమాన్యం విఫలం అయింది. ఇందులో ఓసీపీ చేసే కుట్ర దాగి ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.' అని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. ఆదివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి లతో కలిసి మాట్లాడారు. ఆర్కే-7 గనిలో బొగ్గు ఉత్పత్తి లీజుకు ఫారెస్టు, ఎన్విరాన్‌మెంట్ శాఖల అనుమతి తీసుకోవడంలో యాజమాన్యం, అధికారుల నిర్లక్ష్యం కనబడుతున్నదని ఆరోపించారు. దీనిపై సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టులు, ప్రణాళికలు (పీపీ) నుంచి మొదలుకుని గని మేనేజర్ వరకు అందరిని బాధ్యులను చేస్తు సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పుడు గనిలో ఉత్పత్తి నిలిపివేతకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గనుల ప్రైవేటీకరణ ఒకవైపు ముంచుకొస్తుంటే ఉన్న గనులు కొనసాగించడంలో అధికారులు నిర్లక్ష్యం పెనుశాపంగా మారిందని ఆరోపించారు. కార్మికులు తప్పు చేస్తే ఎల్లో, రెడ్ కార్డుల విధానంతో చర్యలు తీసుకుంటామని సర్క్యులర్ జారీ చేశారని, ఇప్పుడు పైనుంచి కింది వరకు అధికారుల తప్పిదాల వల్లే ఆర్కే-7లో ఉత్పత్తి నిలిచి పోయిందని ఆరోపించారు. అధికారులందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా గనిని ఎందుకు నడిపించారన్నారు. గనిలో నెలపాటు ఉత్పత్తి నిలిచి పోతుందని చెబుతున్నారని పేర్కొన్నారు. గనిలో సుమారు 700 మంది కార్మికులను బదిలీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులందరిని స్థానికంగానే ఉన్న గనులు, డిపార్ట్‌మెంట్లలో సర్దుబాటు చేయాలని, ఇతర ఏరియాలకు బదిలీ చేయరాదని హెచ్చరించారు. కార్మికులకు కనీసం బూట్లు, సాక్సులు, హెల్మెట్లు అందించలేని యాజమాన్యానికి కార్మికులపై ఎల్లో, రెడ్ కార్డుల విధానంతో చర్యలు తీసుకునే అధికారం లేదని మండిపడ్డారు. యాజమాన్యం కార్మికులను దూర ప్రాంతాలకు బదిలీ చేయరాదని, గని వద్దకు వెళ్లి అధికారులు, కార్మికులు అధైర్య పడరాదని, ధైర్యం చెప్పి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకుని తొందరగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఉత్పత్తి చేపట్టడానికి ఫారెస్టు, ఎన్విరాన్‌మెంట్ శాఖల అనుమతులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న క్వార్టర్లలో ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు ఉండరాదని.. వారి వద్ద బకాయిలు వసూలు చేసి ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. వెంటనే కార్మికులకు సంస్థ లాభాలు ప్రకటించి 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలో 108 జనరల్ మజ్దూర్ ఖాళీలను సీనియారిటీ ప్రకారం బేసిక్ తగ్గకుండా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పానగంటి సత్తయ్య, ఆర్జీ 1 ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య, నాయకులు మహిపాల్‌రెడ్డి, ఉత్తేజ్‌రెడ్డి, గొర్ల సంతోష్, సిద్దం తిరుపతి, రాజు నాయక్, వెంకట్‌రెడ్డి, ఉప్పాల సంపత్, బిరుదు శ్రీనివాస్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

అధికారులను సస్పెండ్ చేయాలి

● డిప్యూటేషన్ పేరిట అక్రమాలు, అవినీతికి పాల్పడవద్దు ● హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్, జూలై 14 : ఆర్కే-7 గని నార్త్‌లో బొగ్గు ఉత్పత్తికి ఫారెస్టు, ఎన్విరాన్‌మెంట్ శాఖల అనుమతి తీసుకోవడంలో నిర్లక్ష్యం చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. నాలుగేండ్లుగా అనుమతులు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల ఈ రోజు 1300 మంది కార్మికులు ఆందోళనకు గురికావాల్సి వస్తుందని ఆరోపించారు. ఇందులో మైన్ లీజు అనుమతి ఒక డ్రామాగా కనబడుతున్నదని ఆరోపించారు. ఇంత కాలం అధికారులు నిద్రపోయారా? అని ప్రశ్నించారు. గని మూసి వేసే వరకు రావడం శోచనీయం అన్నారు. దీనికి అధికారులు, యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గనిలో డిప్యూటేషన్ పేరిట అవినీతి, అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. యాజమాన్యం త్వరితగతిన అనుమతులు తెప్పించాలన్నారు. గత జీఎం కూడా ఆర్కే-8గని మూసివేత సమయంలో డిప్యూటేషన్ల పేరిట లక్షల రూపాయల అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆర్కే-7 గనిలో కూడా అలాంటి అవినీతికి తావులేకుండా చూడాలన్నారు. అనుమతులు జాప్యం కావడానికి సంస్థ డైరెక్టర్ పీపీ నిర్లక్ష్యమేనని ఆరోపించారు. వెంటనే అనుమతులు తెప్పించి గనిలో ఉత్పత్తి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హెచ్ఎంఎస్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి జీవన్‌జోయెల్, ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డి, నాయకులు లక్ష్మణ్, అశోక్, సందీప్, వినయ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అటవీ శాఖలో కౌన్సెలింగ్ జాతర

● ప్రశాంతంగా ముగిసిన బీట్ ఆఫీసర్ల ప్రక్రియ ● నేడు భూపాలపల్లిలో జోనల్ పోస్టుల బదిలీలు

జిల్లా అటవీ శాఖ కార్యాలయానికి తరలివచ్చిన ఎఫ్‌బీవోలు

మంచిర్యాల అర్బన్, జూలై 14 : మంచిర్యాల జిల్లా ఆదివారం అటవీ శాఖలో కౌన్సెలింగ్ కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లా అటవీ శాఖలో అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఫారెస్ట్ బీట్ అధికారులకు బదిలీల ప్రక్రియ కార్యక్రమాన్ని జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశీష్ సింగ్‌తోపాటు నలుగురు కమిటీ సభ్యులైన ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో వేణుబాబు, ఎఫ్‌బీవో, కన్వీనర్ వినయ్ కుమార్ సాహు, బెల్లంపెల్లి ఎల్డీవో విజయ్ కుమార్, చెన్నూర్ ఎల్డీవో రమేశ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచే అధికారులు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. మొదటగా అటెండర్ల బదిలీని నిర్వహించగా, అనంతరం జూనియర్ అసిస్టెంట్ల ప్రక్రియ ప్రారంభమైంది. భోజన అనంతరం 40 శాతం ప్రాతిపాదికన 44 మంది ఎఫ్‌బీవోలకు స్థాన చలనం కల్పించారు. ఈసారి కొత్తగా ఆన్‌లైన్ పద్ధతిలో గూగుల్ స్ప్రెడ్‌షీట్ ద్వారా ఎఫ్‌బీవోల బదిలీలను చేపట్టారు. కార్యాలయంలోని ఓ గదిలో ప్రొజెక్టర్ ఏర్పాటు చేసి ఎవరు ఎక్కడికి బదిలీపై వెళ్తున్నారని డిస్ప్లే చేసి వారికి చూపించారు. బీట్ ఆఫీసర్లు, ఉద్యోగులు తమ విధి నిర్వహణలో చూపించిన ప్రతిభ ర్యాంకుల ఆధారంగా, ఉద్యోగంలో కుటుంబ పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని నిబంధనల మేరకు బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించారు.

నేడు జోనల్ పోస్టుల బదిలీలు

అటవీ శాఖలో జోనల్ స్థాయి పోస్టుల బదిలీల ప్రక్రియ సోమవారం భూపాలపల్లిలోని అటవీ శాఖ కార్యాలయంలో నిర్వహించనున్నారు. జోనల్ పోస్టుల్లో ఏవో, ఎఫ్ఆర్‌వో, సీనియర్ అసిస్టెంట్లు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అలాగే మల్టీజోన్ పరిధిలో బదిలీలు ఈ నెల 17న నిర్వహించనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

'ప్రాణహిత-చేవెళ్ల' ఎప్పుడు పూర్తి చేస్తరో చెప్పాలి

● సమస్యలు గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ● ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు.. ● బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్

గూడెం-కర్జెల్లి గుంతల రోడ్డును పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

చింతలమానేపల్లి, జూలై 14 : ప్రజల సమస్యలను గాలికొదిలి రేవంత్ రెడ్డి సర్కారు రాజకీయాల మీద దృష్టి పెట్టిందని, ఇచ్చిన హామీలు మరచిన ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో విరక్తి వచ్చిందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రైతాంగానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తారో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా సేకరించిన భూములకు ఇంకా రైతులకు నష్టపరిహారం అందలేదని, తక్షణమే పరిహారం చెల్లించాలని అన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న తుమ్మిడిహెట్టి, సాండ్‌గాం, రణవెల్లి, కోర్సిని గూడెం, హుడికిలి, లోనవెల్లి, సూర్జాపూర్, జంబుగ ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీరు అందించాలన్నారు. అడ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసి 10 వేల ఎకరాలకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్‌లో అధికార కాంగ్రెస్ నాయకులు చట్టవిరుద్ధంగా నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పులుల అభయారణ్యానికి కేవలం 60 మీటర్ల దూరంలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ, నేషనల్ బోర్డు ఫర్ వైల్డ్ లైఫ్ నుంచి అనుమతులు లేకుండానే చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని కర్జవెల్లి-గూడెం మార్గానికి బీటీ రోడ్డు వర్షాలకు దెబ్బతిని నరక కూపంగా మారిందని మండిపడ్డారు. అధికార పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్సీ దండే విఠల్ చొరవతీసుకుని కేజీబీవీ పాఠశాలకు రోడ్డు వేయించాలని డిమాండ్ చేశారు. మళ్లీ కేసీఆర్ సర్కారు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోమాసె లహాంచు, నీలాగౌడ్, రామ్ ప్రసాద్, ఆవుల రాజ్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679